క్లుప్తంగా

మాజీ ఉప ముఖ్యమంత్రి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: మండలంలోని మేడపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మరడ సింహాచలం తండ్రి సూర్యనారాయణ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

నిడగల్లు పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక



చైర్మన్, వైస్ చైర్మన్‌తో ప్రమాణం చేయిస్తున్న హెచ్ఎం మనోజ్‌కుమార్

సీతానగరం: మండలంలోని నిడగల్లు ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక శనివారం జరిగింది. చైర్మన్‌గా కర్రి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా రాయిపిల్లి రేవతి ఏకగ్రీవంగా ఎన్నికవడంతో పాటు 24 మంది సభ్యులను ఎన్నుకున్నారు. గతంలో రెండుసార్లు ఈ ఎన్నిక పోలీసుల పర్యవేక్షణలో జరిపే ప్రయత్నం చేసినా.. కోరం లేదనే సాకుతో ఎన్నిక వాయిదా పడింది. శనివారం ఎస్ఎం ఎం.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య హెచ్ఎం బి.మనోజ్‌కుమార్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికైన వారితో హెచ్ఎం, ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ ప్రమాణం చేయించారు.

అగ్ని ప్రమాదంలో గృహ సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న వీఆర్‌ఓ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని దయానిధిపురంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన యాళ్ల ఈశ్వరరావు ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించి ఇంట్లో సామగ్రి దగ్ధమైంది. ఈశ్వరరావు ఇంట్లో అందరూ పొలం పనికి వెళ్లగా ఇంట్లో విద్యుత్ బోర్డు నుంచి పొగతో కూడిన మంటలు రావడంతో చుట్టుపక్కల వారు చూసి యజమానికి సమాచారం ఇచ్చారు. అదే సమయంలో మంటలను అదుపు చేశారు. అయితే ఇంట్లో ఉన్న వస్తువులు, తిండి గింజలు, కొంత మొత్తం నగదు కాలిపోయినట్టు బాధితుడు ఈశ్వరరావు తెలిపాడు. వీఆర్‌ఓ శ్రీనివాసరావు నష్టం అంచనా వేసి తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపాడు.

గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో విధానం

సాలూరు: గణేష్ ఉత్సవాల అనుమతులకు సంబంధించి సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామని సీఐ అప్పలనాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గణేష్‌ఉత్సవ్ వెబ్‌సైట్‌లో లేదా 79950 95800 వాట్సాప్ నంబరుకు హాయ్ అని మెసేజ్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండపాల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జనం తదితర అనుమతుల కోసం సంబంధిత పత్రాలు సమర్పించి మీ సేవలో చలానా చెల్లించిన తరువాత అనుమతులు జారీ చేస్తామన్నారు. ఈ క్రమంల క్యూ ఆర్ కోడ్‌ను పొందవచ్చన్నారు. వీటిని మండపాల్లో కనిపించే విధంగా ఉంచాలన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

యువత సన్మార్గంలో నడవాలని సీఐ అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించి యువత జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఏజెన్సీకి వైరల్ ఫీవర్



డిప్పలపాడు గ్రామంలో జ్వర పీడితులు, (ఇన్‌సెట్లో) దిగువశెంబిలో జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు

సాలూరు మండలంలోని గిరి శిఖర గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో ప్రతి ఇంటిలో వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న పీడితుడు ఉన్నాడంటే నమ్మాల్సిందే...జ్వర పీడితులు తోణాం, మామిడిపల్లి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పొందుతున్నారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్న వారు సాలూరు సీహెచ్‌సీకి వెళ్తున్నారు. డిప్పలపాడు గ్రామంలో తామలి తవుడమ్మ, గెమ్మెల సుజాత జ్వరంతో బాధపడుతున్నారు. దిగువశెంగి గ్రామంలో చోడిపల్లి సునీతకు చెందిన కవల పిల్లలు జ్వరంతో బాధపడుతున్నారు. వీరిని కొలియా గ్రామంలోని ఒడిశా ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించాలని వైద్యులు సూచించినట్టు బాధితులు తెలిపారు. ఇదే సమయంలో కొలియా గ్రామాల్లోని జ్వర పీడితులు ఒడిశాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని గిరి ప్రజలు కోరుతున్నారు.

– సాలూరు రూరల్

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం

- మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైందని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మేడపల్లి గ్రామానికి చెందిన మరడ సింహాచలం తండ్రి చనిపోవడంతో శనివారం పరామర్శించారు. అనంతరం అక్కడి కార్యకర్తలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇస్తామన్న పథకాలను ఇవ్వకపోగా.. ఉన్న పింఛన్లు తీసేసేందుకు సిద్ధమవుతుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలవుతున్నా ఇప్పటి వరకు రైతన్నకు పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం ఊసేలేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాలూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన సీపీ టీమ్



సాలూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ టీమ్ సభ్యులు

సాలూరు: పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను సీపీ టీమ్ శనివారం పరిశీలించింది. భువనేశ్వర్ నుంచి వచ్చిన ఈ టీమ్ సభ్యులు స్టేషన్ పరిసరాలను, పట్టాల పరిస్థితి తదితర అంశాలను పరిశీలించారు. పలు అంశాలపై ఆరా తీశారు. ఈ సభ్యులు రాకతో అతి త్వరలోనే సాలూరు - బొబ్బిలి - విశాఖపట్నం మధ్య రైలు సర్వీసు ప్రారంభమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా త్వరలో ఈ సర్వీసు ప్రారంభమవుతుందని అధికారులు స్పష్టం చేశారు. సాలూరు - బొబ్బిలి రైలు సర్వీసును విశాఖపట్నం వరకు పొడిగిస్తూ ఈస్ట్ కోస్టు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

ప్రతి హామీ అమలు చేస్తాం : ఎమ్మెల్యే



పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమానికి ఆయన శనివారం హాజరయ్యారు. ప్రతినెల 1వ తేదీన పింఛన్ల పంపిణీ జరిగేదని, ఈసారి ఒకరోజు ముందుగానే దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు పండగ వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అందుకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నారని అన్నారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీతంపేటలోనే ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీస్..!

సీతంపేట: గిరిజన సంక్షేమ కార్యాలయం ప్రస్తుతానికి సీతంపేటలోనే కొనసాగనుందని స్థానిక అధికారులకు కలెక్టరేట్ నుంచి సమాచా రం వచ్చినట్టు తెలిసింది. ఈ కార్యాలయాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి తరలించనున్నారని ఇటీవల గుసగుసలు వినిపించాయి. ఈ నేపథ్యంలో గిరిజన సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పా టు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇటీవల ఇన్‌చార్జ్ పీఓ వీవీ రమణకు వినతిపత్రాలు అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

సాలూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ అన్నారు. సెప్టెంబర్ 2న పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవంసందర్భంగా ఆయన అభిమాన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని డబ్బివీధిలో వాలీబాల్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించడం ద్వారా మంచిగా ఎదగాలన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పాటించాలన్నారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తం



శివరాంపురం వంతెన వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

సాలూరు: తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పట్టణం, మండలంలో ప్రమాదకర, పొంగిపొర్లే వాగులు, నదులు, వంతెనలు తదితర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, అత్యవసర సమయంలో తప్పితే ప్రజలు బయటకు రావొద్దని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సోమవారం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అన్ని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ సెలవు ప్రకటించారని పేర్కొన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై తస్మాత్...

- ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అనిల్‌కుమార్



సాలూరు: బ్యాంకు ఖాతా దారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. సాలూరులో ఆయన శనివారం మాట్లాడుతూ బ్యాంకు పరిధిలోని ఖాతాల్లో ఇటీవల సైబర్ నేరాల సంఖ్య పెరిగిందన్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి సెల్‌ఫోన్లకు వచ్చే లింకులు, మేసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 48 గంటల్లోగా 1930 నంబరుకు డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల తమ వంతు బాధ్యతగా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులంతా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ ఎస్ఐ దినకర్ అన్నారు. మండలంలోని కవిటిభద్ర కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సెల్‌ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు తక్షణమే పోలీసు సిబ్బందికి తెలియజేయాలన్నారు. మొబైల్ ఫోన్‌లకు వచ్చిన లింక్‌లు టచ్ చేసి సైబర్ నెరగాళ్ల చేతికి చిక్కొద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్ఐ దినకర్

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు



గోతులను పూడుస్తున్న యువత

పార్వతీపురం:

మండలంలోని ఎమ్మార్‌నగరం నుంచి సంగంవలసకు వెళ్లే రహదారి పరిధిలో పలుచోట్ల గోతుల మయం కావడంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలియజేసినప్పటికీ చర్యలు లేకపోవడంతో సంగంవలసకు చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా గ్రావెల్‌ను తెప్పించి శ్రమదానంతో గోతుల్లో వేసి పూడ్చారు. రహదారి కాస్త మెరుగు కావడంతో ఈ రహదారిపై రాకపోకలు చేసే చోదకులు యువతను అభినందించారు.

అదనంగా చెరకు తూనిక యంత్రాలు



వెంకటాపురం వద్ద అమర్చడానికి సిద్ధం చేస్తున్న చెరకు తూనిక యంత్రం

సీతానగరం: సంకిలి ఈఐడీ ప్యారీస్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం చెరకు క్రషింగ్ సీజను సమీపిస్తుండడంతో చెరకు రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, చెరకు తరలించడానికి అదనంగా తూనిక యంత్రాలు ఏర్పాటు చేయడంలో నిమగ్నమైంది. భవిష్యత్‌లో చెరకు సాగు విస్తీర్ణం పెంపొందించడానికి, అధిక దిగుబడులు సాధనకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడానికి యాజమాన్య ప్రతినిధులు సమాయత్తమయ్యారు. ఈ మేరకు లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం పరిధిలో ఉన్న బొబ్బిలి, సీతానగరం, మక్కువ, రామభద్రాపురం తదితర మండలాల్లో 2021 మంది రైతులు చెరకు పంట సాగు చేస్తుండగా 1445 మంది రైతులు ప్రోత్సాహకాలు పొందడానికి అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో ఈఐడీ ప్యారీస్ చక్కెర కర్మాగారానికి ఇప్పటికే నిబంధనలను అనుసరించి చెరకు సరఫరా చేసిన రైతులకు యాజమాన్యం (2023–24 సీజనులో) మొక్క చెరకు సాగు చేస్తున్న రైతుకు ఎకరాకు రూ.4 వేలు, మమ్ము తయారు చేసిన రైతుకు ఎకరా విస్తీర్ణానికి రూ.2 వేలు వంతున 1445 మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు ప్రోత్సాహకాలను జమ చేసింది. ఈ ప్రాంతం నుండి కర్మాగారానికి చెరకు సరఫరా చేసేందుకు ఇప్పటికే 7 చెరకు తూనిక యంత్రాలు పని చేస్తుండగా ఈ ఏడాది అదనంగా సీతానగరం మండలం నిడగల్లు, వెంకటాపురం, కృష్ణారాయపురం గ్రామాల్లో తూనిక యంత్రాలు ఏర్పాటుకు సిద్ధం చేసారు. బొబ్బిలి మండలం అలజంగి, వాడాడ, పినపెంకి గ్రామాల్లో తూనిక యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు. చెరకు రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలు, తూనిక కేంద్రాలు ఏర్పాటు విషయమై డీజీఎం (కేన్) రమేష్ వద్ద ప్రస్తావించగా కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి సూచనల మేరకు చెరకు సాగు విస్తీర్ణం పెంచడానికి రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. పంట పొలాలకు సమీపంలో అదనంగా తూనిక యంత్రాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.